RNI: TELTEL12215

https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :209 EDITOR: CHERUKU UPENDAR, DATE : THURSDAY 14 DECEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 209 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : గురువారం 14 డిసెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## ఛత్తీస్‌గఢ్ సీఎంగా విష్ణుదేవ్ సాయ్ ప్రమాణస్వీకారం



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఛత్తీస్‌గఢ్‌లో ఇవాళ నూతన సర్కార్ కొలువుదీరింది. బీజేపీ అభ్యర్థి విష్ణుదేవ్ సాయ్ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్ సావో, ఎమ్మెల్యే విజయ్ శర్మ డిప్యూటీ సీఎంలుగా ప్రమాణం చేశారు. గవర్నర్

మిగతా 2లో



### తక్షణమే కాల్పుల విరమణ

## ఐరాస తీర్మానం

గాజా - ప్రభాత సూర్యుడు

మానవతా దృష్టితో గాజాలో తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. సుమారు రెండు నెలల క్రితం ఇదే రకమైన తీర్మానంపై ఐరాసలో ఓటింగ్ జరిగినప్పుడు గైర్హాజరు అయిన భారత్, ఈసారి మద్దతుగా ఓటేయడం విశేషం. తీర్మానానికి అనుకూలంగా 153 సభ్య దేశాలు ఓటు వేశాయి. అంటే ఐరాస సభ్య దేశాలలో సుమారు 80% దేశాలు తక్షణ కాల్పుల విరమణకు మద్దతు తెలిపాయి. తీర్మానాన్ని 10 దేశాలు వ్యతిరేకించగా 23 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. పౌరుల ప్రాణాలు కాపాడేందుకు, చట్టపరమైన, మానవతావాద కర్తవ్యాలను నెరవేర్చేందుకు కాల్పుల విరమణ పాటించాలని తీర్మానం కోరింది.

మిగతా 2లో

# ధరణిపై సమగ్ర నివేదిక..!

- భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ
- అన్ని వివరాలు నివేదికలో పొందుపర్చండి
- వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విస్తీర్ణమెంత?
- సీఎస్‌ను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

భూ సంబంధిత వివాదాల శాశ్వత పరిష్కారం కోసం మార్గ దర్శకాలను ప్రతిపాదించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ధరణి పనితీరు, భూ సంబంధిత అంశాలపై బుధవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, సంబంధిత అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. గతంలో వేసిన కోనేరు రంగారావు కమిటీ మాదిరిగానే ఈ కమిటీని ఏర్పాటు చేయాలని అన్నారు. మంత్రులతోపాటు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు, రైతు






ప్రతినిధులు, భూ సంబంధిత చట్టాల్లో నిష్ణాతులు కమిటీలో సభ్యులుగా ఉండాలన్నారు. ధరణి యాప్ భద్రతపై సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ధరణిపై తీసుకున్న నిర్ణయాలపై పూర్తి నివేదిక అందజేయాలని సీఎస్ శాంతి కుమారిని సీఎం ఆదేశించారు. ఈ పోర్టల్‌పై వస్తున్న విమర్శల నేపథ్యంలో డేటా రూపంలో వివరణ ఇవ్వాలని

మిగతా 2లో



### రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో

## కేంద్ర జోక్యాన్ని అడ్డుకోండి

- కేంద్రం చర్యలతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1,07,513.09 కోట్లు వ్యయ నష్టం
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేరళ ప్రభుత్వం

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యాన్ని సవాలు చేస్తూ కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు కేరళ ప్రభుత్వం బుధవారం పిటిషన్ దాఖలు చేసింది. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో కేంద్రం జోక్యం చేసుకుంటున్నదని, రుణం తీసుకునే అధికారాన్ని పరిమితం చేస్తున్నదని విమర్శించింది. కేంద్రం చర్యలు

మిగతా 2లో

## భూమిపై నరకం గాజా !



- ఐక్యరాజ్య సమితి వ్యాఖ్యలు
- 24గంటల్లో 207మంది మృతి
- కమల్ అద్వాన్ ఆసుపత్రిపై ఇజ్రాయిల్ దాడి

2 లో

## ద్రవ్యోల్బణాన్ని పెంచడమే మోడీ ప్రధాన హామీ




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

మోడీ ప్రభుత్వంలో నిత్యవసరాల ధరలు ఆకాశాన్నంటాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ధ్వజమెత్తారు. ద్రవ్యోలణాన్ని పెంచడమే మోడీ ప్రధాన హామి అని బుధవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఈ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే పలు అంశాలను తెరపైకి తీసుకువస్తున్నారని అన్నారు. బిజెపి

మిగతా 2లో

## డ్రగ్స్ ముఠాలపై ప్రత్యేక దృష్టి

- మహిళల భద్రతకు పెద్దపీట సీపీ కొత్తకోట శ్రీనివాస్
- హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరణ



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

హైదరాబాద్ నూతన సీపీగా కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. బంజారా హిల్స్‌లోని సీసీసీలో హైదరాబాద్ సీపీగా బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సంద ర్భంగా సీపీ మాట్లాడారు. డ్రగ్స్ మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని తెలిపారు. నగరంలో డ్రగ్స్ ముఠాపై ప్రత్యేక నిఘా వేస్తామని తెలిపారు. సినీ పరిశ్రమలో డ్రగ్స్ మూలాలుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళల భద్రతకు పెద్దపీఠ వేస్తామని తెలిపారు. పబ్స్, రెస్టారెంట్లు, ఫామ్‌హౌస్ యజమానులు జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. డ్రగ్స్ ముఠాల ఆగడాలను అరికడ్తామ ని, వారిని ప్రోత్సహించే వారిపై సైతం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చట్టాన్ని గౌరవించే వారితోనే ఫ్రెండ్లీ పోలీసింగ్ అని, శాంతి భద్రతలను ఉల్లంఘంచే వారితో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అధికారులు, మీడియా, సిబ్బంది సహకారంతో సమన్వయం చేసుకుం టూ ముందుకెళ్తానని స్పష్టం చేశారు.


### కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి నేపథ్యం

ఆగస్టు 5, 1965లో మహ బూబ్‌నగర్ కొత్త కోటలో ఆయన జన్మించారు. ఎం.ఏ, ఎల్ఎల్‌బీ చేశారు. సెప్టెంబర్ 9, 1994లో ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. అదనపు డీజీపీగా ఎదిగారు. మొదటి పోస్టింగ్ నిజా మాబాద్ జిల్లా బోదన్‌లో ఏఎస్పీగా పనిచేశారు. మెదక్‌జిల్లా కామారెడ్డీ స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేశారు. 2000 నుంచి 2002

మిగతా 2లో

# ఉలిక్క పడ్డ పార్లమెంటు

- బిజెపి ఎంపి ఇచ్చిన పాస్ తో చొరబడ్డ దుండగులు
- లోక్‌సభలో విజిటర్ గ్యాలరీ నుంచి సభలోకి దూకిన వ్యక్తి
- కలర్ స్మోక్ తో వదిలి భయభ్రాంతులు
- బయటకు పరుగులు తీసిన ఎంపిలు
- లోక్‌సభ స్పీకర్ చైర్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నం
- పట్టుకున్న ఎంపిలు భద్రతా సిబ్బందికి అప్పగింత
- విజిటర్ పాస్‌లు రద్దు భద్రతలో భారీ లోపం



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

లోక్‌సభలో బుధవారం భద్రతా వైఫల్యం కొట్టచ్చినట్లు కన్పించింది. సభలో ఒక్కసారిగా తీవ్ర అలజడి చోటు చేసుకుంది. సందర్శకుల గ్యాలరీ నుండి ఇద్దరు వ్యక్తులు హఠాత్తుగా సభలోకి దూకి అలజడి సృష్టించారు. సిలిండర్ ఆకారంలో ఉండే గ్యాస్ డబ్బాలను తమ వెంట తెచ్చుకున్న దుండగులు జీరో అవర్‌లో సభలో ప్రవేశించారు. వారిలో ఓ వ్యక్తి సభ్యులు కూర్చునే బెంచీలపై దూకుతూ కన్పించగా మరొకడు గ్యాలరీ నుండి కిందికి వేలాడుతూ డబ్బాలోని గ్యాస్‌ను బయటికి వదిలాడు. దీంతో సభలో తీవ్ర అలజడి, గందరగోళం ఏర్పడింది. దుండగులు ఇద్దరూ మైసూరుకు చెందిన బిజెపి ఎంపీ ప్రతాప్ సింహ నుండి పాస్‌లు తీసుకొని సభలో ప్రవేశించారని కొందరు ఎంపిలు తెలిపారు. కలకలం రేపిన ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు, దర్యాప్తు బృందాలు, ఇంటెలిజెన్స్ అధికారులు, ఫోరెన్సిక్ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. చట్టవిరుద్ధంగా సభలో ప్రవేశించి అలజడి సృష్టించిన నిందితులను సాగర్ శర్మ, మనోరంజన్‌గా గుర్తించారు. వారి వద్ద నుండి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారుల కథనం ప్రకారం నిందితులిద్దరూ మైసూర్‌కు చెందిన వారు. సాగర్ శర్మ బెంగళూరులో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. జరిగిన ఘటనపై సమగ్ర దర్యాప్తు నిమిత్తం అధికారులు నిందితుల నివాసాలకు చేరుకొని వారి నేపథ్యాన్ని ఆరా తీశారు. వారికి ఉగ్రవాద సంస్థలతో

మిగతా 2లో

## తక్షణమే కాల్పుల విరమణ

# ఐరాస తీర్మానం

(మొదటి పేజీ తరువాయి)

ఆక్రమిత తూర్పు జెరుసలేం లోనూ, మిగిలిన పాలస్తీనా ఆక్రమిత భూభాగంలోనూ ఇజ్రాయిల్ సాగిస్తున్న అక్రమ చర్యలపై చర్చించేందుకు ఐరాస 10వ అత్యవసర సమావేశం న్యూ యార్క్‌లో జరిగింది. అక్టోబర్‌లో ఐరాసలో ఇదే విధమైన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ సందర్భంగా జరిగిన ఓటింగ్‌కు భారత్ సహా 45 దేశాలు గైర్హాజరు అయ్యాయి. అప్పుడు తీర్మానానికి అనుకూలంగా 120 ఓట్లు, వ్యతిరేకంగా 14 ఓట్లు వచ్చాయి. తాజా ఓటింగ్‌లో తీర్మానాన్ని వ్యతిరేకించిన దేశాల సంఖ్య 10కి తగ్గింది. అమెరికా, ఆస్ట్రియా, సెచియా, లైబేరియా, పసిఫిక్ భాగస్వామ్య దేశాలు తీర్మానాన్ని వ్యతిరేకించాయి. ఓటింగ్‌కు దూరంగా ఉన్న దేశాల సంఖ్య కూడా 45 నుండి 23కి తగ్గడం గమనార్హం. తీర్మానాన్ని అరబ్ గ్రూప్, ఇస్లామిక్ సహకార సంస్థ ప్రవేశపెట్టాయి. ఉక్రెయిన్‌పై దురాక్రమణను ఖండించిన దేశాల కంటే తీర్మానాన్ని ప్రవేశపెట్టిన దేశాల సంఖ్యే ఎక్కువగా ఉంది. తీర్మానంలో ఆస్ట్రియా, అమెరికా దేశాలు రెండు సవరణలు ప్రతిపాదించాయి. అయితే మూడింట రెండు వంతుల మంది సభ్యుల మద్దతు లభించకపోవడంతో వాటిని తీర్మానంలో చేర్చలేదు. గాజాలో మానవతావాద విపత్తు సంభవించిందని తీర్మానం తెలిపింది. పాలస్తీనా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించింది. అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి పాలస్తీనా, ఇజ్రాయిల్ పౌరులను కాపాడాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పింది. బందీలందరినీ బేషరతుగా విడుదల చేయాలని, మానవతావాద సాయానికి అవకాశం ఇవ్వాలని తీర్మానం డిమాండ్ చేసింది.

గత తీర్మానం సందర్భంగా గైర్హాజరు అయిన 21 దేశాలు ఈసారి తీర్మానాన్ని సమర్థించాయి. వాటిలో సగం యూరోపియన్ యూనియన్ దేశాలే. గమనించాల్సిన మరో ముఖ్యమైన విషయమేమంటే అమెరికాకు కీలక భాగస్వాములుగా ఉన్న కెనడా, ఆస్ట్రేలియా, జపాన్ దేశాలు తీర్మానానికి అనుకూలంగా ఓటేశాయి. ఆసియా దేశాలలో ఫిలిప్పీన్స్ కూడా తీర్మానాన్ని సమర్థించింది. తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయడంపై భారత్ వివరణ ఇస్తూ అక్టోబర్ 7న జరిగిన ఉగ్ర దాడిని ప్రస్తావించింది. అయితే ఈసారి కూడా హమాస్‌పై స్పష్టత ఇవ్వలేదు. ఇదిలా ఉండగా ఇజ్రాయిల్ దాడుల కారణంగా గాజాలో మరణించిన వారి సంఖ్య 18 వేలకు చేరింది.

## డ్రగ్స్ ముఠాలపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

వరకు నెల్లూర్ డీసీపీగా పనిచేశారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ డీసీపీగా, 2004లో వరంగల్ ఎస్పీగా పనిచేశారు. ఆ తర్వాత ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా, హైదరాబాద్ రేంజ్ డీఐజీగా, అడిషనల్ డైరెక్టర్ ఏసీబీలో పని చేశారు. వైజాగ్‌లో హౌంది పార్టుమెంట్‌లో స్పెషల్ సెక్రెటరీగా పనిచేశారు. ఆపరేషన్ గ్రేహౌండ్స్, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, అకో ట్పస్‌తో పాటు వివిధ హౌదాల్లో పనిచేశారు. 2023 జనవరి నుంచి ఈ నెల వరకు అడిష నల్ డీజీపీగా ఉన్నారు. ఐఐఎం, అహ్మదాబాద్ లో చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కోర్స్ పూర్తి చేశారు. మిడ్-కెరీర్ ట్రైనింగ్ ప్రొగ్రామ్ (ఐపీఎస్ అధికారులకు ఇచ్చే ట్రైనింగ్)ను కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం, యూకేలో కోర్సు పూర్తి చేశారు. యాంటీ టెర్రరిజం అసిస్టెన్స్ (ఏటీఏ) కోర్సును హంగేరీలో పూర్తి చేశారు. ఇండియన్ పోలీస్ మెడల్- 2010లో అందుకున్నారు. విశిష్ట సేవకు రాష్ట్రపతి పోలీస్ పథకాన్ని 2019లో, 2023లో సేవా పథకాన్ని అందుకున్నారు.

# భూమిపై నరకం గాజా !

గాజా - ప్రభాత సూర్యుడు

ఇజ్రాయిల్ హంతక దాడులతో గాజా 'భూమిపై నరకం' మాదిరిగా తయారైందని ఐక్యరాజ్య సమితి వ్యాఖ్యానించింది. దక్షిణ, సెంట్రల్ గాజాల్లో ఇజ్రాయిల్ సైన్యం సాగిస్తున్న దాడుల్లో అనేకమంది మరణించారు. ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకుని వరుస బాంబు దాడులు చేస్తున్న ఇజ్రాయిల్ తాజాగా కమల్ అద్వాన్ ఆసుపత్రిపై విరుచుకుపడింది. పేషెంట్ల రూమ్‌లోకి ప్రవేశించి యథేచ్ఛగా సైన్యం కాల్పులు జరిపింది. రోగులు, వైద్య సిబ్బందిని అందరినీ ఆసుపత్రి ఆవరణలో ఒక చోటకు నెట్టి వారిని తనిఖీల పేరుతో వేధించింది. కొందరిని అరెస్టు చేసింది. ఇజ్రాయిల్ సైన్యం దాడుల్లో ఇప్పటికే చాలా ఆసుపత్రులు ధ్వంసమయ్యాయి. దక్షిణ గాజాలో పనిచేస్తున్న ఒకే ఒక ఆసుపత్రి కమల్ అద్వాన్. ఇప్పుడు దానిని కూడా ఇజ్రాయిల్ సైన్యం నాశనం చేసింది. దీనిపై గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రపంచ ఆరోగ్య సంస్థకు ఫిర్యాదు చేసింది. గాజాలో ఆరోగ్య సేవలను పూర్తిగా స్తంభింపచేయాలన్నది ఇజ్రాయిల్ లక్ష్యంగా వుందని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ విమర్శించింది. ఇప్పటివరకు 22 ఆస్పత్రులు, 46 ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు దాడులకు గురయ్యాయి. ఆరోగ్య సేవలు పూర్తిగా స్తంభించాయి. దీంతో గాయపడిన వారు చికిత్స కోసం విదేశాలకు వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రులను చుట్టుముట్టి ఎవరూ లోపలకు వెళ్లకుండా, బయటకు రాకుండా అడ్డుకుంటున్నారు. వైద్య సిబ్బందిపై, రోగులపై తరచుగా కాల్పులు జరుపుతున్నారు. ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ మంగళవారం ప్రత్యేకంగా సమావేశమైంది. శాంతి కోసం ఐక్యంగా నిలవాలని ఈ సమావేశంలో ఐరాస జనరల్ అసెంబ్లీ అధ్యక్షులు పిలుపునిచ్చారు. గాజాలో కాల్పుల విరమణ పాటించాలని ఐరాస భద్రతా మండలి ఆమోదానికి పెట్టిన తీర్మానాన్ని అమెరికా వీటో చేసిన సంగతి తెలిసిందే. గాజాలో ఇజ్రాయిల్ రెండు మాసాలుగా జరుపుతున్న దాడుల్లో ఇప్పటివరకు మొత్తంగా 18,200మంది మరణించారని ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

# ఉలిక్కి పడ్డ పార్లమెంటు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధాలేమైనా ఉన్నాయా అన్న దానిపై దృష్టి సారించాయి. మరోవైపు ఫోరెన్సిక్ అధికారులు అవసరమైన సాక్ష్యాధారాలు సేకరించారు. లోక్‌సభలో జరిగిన ఘటనపై స్పీకర్ ఓం బిర్లా ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. శివసేన ఎంపీ అరవింద్ కథనం ప్రకారం నిందితులలో ఒకడిని ఓ ఎంపీ పట్టుకున్నారు. ఆ సమయంలో మరో దుండగుడు బెంచీలపై గెంతుతూ భయానక వాతావరణాన్ని సృష్టించాడు. కాలి బూటును విప్పి అందులో దాచిన గ్యాస్ డబ్బాను తెరిచాడు. దీంతో ఆ ప్రదేశమంతటా పసుపుపచ్చని రంగులో పొగ వ్యాపించింది. 'నియంతృత్వాన్ని అనుమతించకూడదు' అని దుండగులు నినాదాలు చేసినట్లు కొందరు ఎంపీలు తెలిపారు. ఘటన జరిగిన సమయంలో సభాపతి స్థానంలో బీజేపీ ఎంపీ రాజేంద్ర అగర్వాల్ కూర్చున్నారు. 'సందర్శకుల గ్యాలరీ నుండి ఎవరో పడిపోయారని తొలుత సభ్యులు భావించారు. అప్పుడే రెండో వ్యక్తిని చూశాం. వారిలో ఒకరు తన బూటు నుండి ఒక క్యాన్‌ను బయటకు తీసి స్ప్రే చేశారు. ఎంపీలు గుర్జీత్ సింగ్ ఓజ్ల (కాంగ్రెస్), గోరంట్ల మదధవ్ (వైసిపి) హనుమాన్ వానియల్ (బిజెపి) వారిని పట్టుకుని భద్రతా సిబ్బందికి అప్పగించారు. ఇది జరిగినప్పుడే పార్లమెంటు వెలుపల ఒక మహిళతో సహా ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. వారిలో ఒకరు హర్యానాలోని హిస్సార్‌కు చెందిన నీలం(42), మరొకరు మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన అమోల్ షిండే (25)గా భద్రతా దళాలు గుర్తించాయి. ఈ సంఘటన జరిగిన వెంటనే అగర్వాల్ సభను వాయిదా వేశారు. సభ తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశమైంది. ఘటనపై విచారణ జరుగుతోందని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. 'సభలో ప్రవేశించిన ఇద్దరిని, సభ వెలుపల ఇద్దరిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను లలిత్, విక్రమ్‌లుగా పోలీసులు గుర్తించారు. నిందితులందరూ తమ బూట్లలో పొగ డబ్బాలను తీసుకెళ్లారని నివేదికలు చెబుతున్నాయి. "తమకు ఏ సంఘంతోనూ సంబంధం లేదు. ప్రభుత్వం పౌరులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నందున ఈ చర్యకు పాల్పడ్డాం" అని నిందితులు మీడియాతో అన్నారు. వివిధ ఏజెన్సీలు ఏకకాలంలో నిందితులను విచారించాయి. ఈ కేసులో మొత్తం ఆరుగురు వ్యక్తులు ఉన్నట్లు స్పష్టమైంది. ఈ ఆరుగురు సోషల్ మీడియాలో ఒకరికొకరు కనెక్ట్ అయినట్లు భద్రతా దళ వర్గాలు తెలిపాయి. ఫోరెన్సిక్ బృందం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ నుండి నమూనాలను సేకరించడం పూర్తి చేసింది. ఆరుగురు నిందితులు ఒకరికొకరు ఆరేళ్లుగా తెలుసునని, కొద్ది రోజుల క్రితం పథకం పన్నారని పోలీసులు తెలిపారు. ఆరుగురూ పార్లమెంట్‌లోకి ప్రవేశించాలని అనుకున్నారు. కానీ ఇద్దరికి మాత్రమే విజిటర్స్ పాస్ లభించడంతో లోపలికి వెళ్లారు. పార్లమెంటు భద్రతను ఉల్లంఘించేలా ఏదైనా సంస్థ లేదా వ్యక్తి ఆరుగురు నిందితులకు "సూచనలు" ఇచ్చారా? అని భద్రతా సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. దుండగులు విడుదల చేసిన వాయువు హానికరమైనది కాదని ప్రాథమిక విచారణలో తేలింది' అని చెప్పారు.

జరిగిన ఘటనపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. '2001లో పార్లమెంట్‌పై దాడి జరిగింది. దానికి గుర్తుగా 19వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఆ సమయంలో అమరులైన భద్రతా సిబ్బందికి నివాళి అర్పిస్తున్నాం. ఇప్పుడు అదే సమయంలో దాడి జరగడం పలు ప్రశ్నలను రేకెత్తిస్తోంది' అని కాంగ్రెస్ సభ్యుడు అధిర్ రంజన్ చౌదరి అన్నారు. 'ఉండాల్సినంత భద్రత లేదా? ఎంపీలందరూ కలిసి దుండగులను పట్టుకున్నారు. మరి ఇతర భద్రతా సిబ్బంది ఎక్కడ ఉన్నారు?' అని నిలదీశారు. ఈ ఘటన చాలా తీవ్రమైనదని తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సుదీప్ బందోపాధ్యాయ వ్యాఖ్యానించారు. ఈ ఘటన భద్రతాపరమైన ఉల్లంఘనేనని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్ అన్నారు. సభకు వచ్చే వారికి ట్యాగ్‌లు ఉండవని అంటూ దీని గురించి ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. దీనిపై స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ సభ్యులు వ్యక్తం చేసిన ఆందోళనను గమనించానని, ఇకపై సందర్శకులకు పాస్‌లు ఏ విధంగా జారీ చేయాలనే విషయంపై ఎంపీలతో చర్చిస్తానని అన్నారు. సభ జీరో అవర్‌లో ఈ ఘటన జరిగిందని స్పీకర్ తెలిపారు. సభా కార్యక్రమాలు జరగకుండా ఎవరూ నిరోధించలేరని ఆయన సభ్యులకు హామీ ఇచ్చారు. మరో ఇద్దరు నిందితులను లలిత్, విక్రమ్‌లుగా పోలీసులు గుర్తించారు. నిందితులందరూ తమ బూట్లలో పొగ డబ్బాలను తీసుకెళ్లారని నివేదికలు చెబుతున్నాయి. "తమకు ఏ సంఘంతోనూ సంబంధం లేదు. ప్రభుత్వం పౌరులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నందున ఈ చర్యకు పాల్పడ్డాం" నిందితులు మీడియాతో అన్నారు. వివిధ ఏజెన్సీలు ఏకకాలంలో నిందితులను విచారించాయి. ఈ కేసులో మొత్తం ఆరుగురు వ్యక్తులు ఉన్నట్లు స్పష్టమైంది. ఈ ఆరుగురు సోషల్ మీడియాలో ఒకరికొకరు కనెక్ట్ అయ్యారు. ఆరుగురిలో నలుగురిని అరెస్టు చేయగా, ఐదుగురిని గుర్తించగా, ఒకరిని గుర్తించాల్సి ఉంది. ఫోరెన్సిక్ బృందం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ నుండి నమూనాలను సేకరించడం పూర్తి చేసింది. ఆరుగురు నిందితులు ఒకరికొకరు ఆరేళ్లుగా తెలుసునని, కొద్ది రోజుల క్రితం పథకం పన్నారని పోలీసులు తెలిపారు. ఆరుగురూ పార్లమెంట్‌లోకి ప్రవేశించాలని అనుకున్నారు. కానీ ఇద్దరికి మాత్రమే విజిటర్స్ పాస్ లభించడంతో లోపలికి వెళ్లారు. పార్లమెంటు భద్రతను ఉల్లంఘించేలా ఏదైనా సంస్థ లేదా వ్యక్తి ఆరుగురు నిందితులకు "సూచనలు" ఇచ్చారా? అని భద్రతా సంస్థలు ప్రయత్నిస్తున్నాయి.

# ధరణిపై సమగ్ర నివేదిక..!

(మొదటి పేజీ తరువాయి)

అధికారులకు సూచించారు. నిషేధిత భూములు, అసైన్డ్ భూములు, వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విస్తీర్ణమెంత? పూర్తి వివరాలను నివేదికలో పొందు పర్చాలన్నారు. గతంలోని భూ సమగ్ర సర్వేపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సదస్సులు, రికార్డుల్ల సవరణ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. భూముల సర్వే, డిజిటలైజేషన్, టైటిల్ గ్యారంటీ, చట్టం తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.83 కోట్ల నిధులు ఎమయ్యాయని అధికారులను సీఎం ప్రశ్నించారు. రెవెన్యూ శాఖలో ఉద్యోగాల భర్తీపై కూడా సీఎం ఈ సందర్భంగా చర్చించారు. గత ప్రభుత్వం భూముల డిజిటలైజేషన్ కోసం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ సమస్యల నిలయంగా మారిందని, ప్రజలు ఈ పోర్టల్ వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనీ, ఎన్నికల ప్రచారంలో ఆరోపించిన ముఖ్యమంత్రి, అధికారంలోకి రాగానే దాన్ని ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు. అందులో భాగంగానే ధరణి పోర్టల్‌పై సంబంధిత అదికారులతో సమీక్ష నిర్వహించారు. ధరణిని రద్దు చేసి కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టు భూమాత పోర్టల్‌ను తీసుకురావడంలో భాగంగానే బుధవారం సీఎం సమీక్ష నిర్వహించి కమిటీ ప్రతిపాదన చేసినట్టు సమాచారం.

## ద్రవ్యోల్బణాన్ని పెంచడమే మోడీ ప్రధాన హామీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోడీ హామీల గురించి మాట్లాడుతోందని, అయితే ఇతర హామీల గురించి తెలియదు కానీ తొమ్మిదిన్నరేళ్లలో దేశానికి ద్రవ్యోల్బణం హామీ మాత్రమే లభించిందని అన్నారు. ఈ ప్రభుత్వ తప్పుడు విధానాలతో ఇప్పటికే ద్రవ్యోల్బణం 45 ఏళ్ల రికార్డును అధిగమించిందని అన్నారు. నిత్యవసరాల ధరలు పెరుగుతూనే ఉన్నాయని, ఆహార పదార్థాల ధరలు పెరగడంతో.. ప్రస్తుతం రిటైల్ ద్రవ్యోల్బణం 5.5 శాతానికి చేరిందని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ నిర్వహణపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం వైఫల్యంతోనే నిరుద్యోగం, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో

# కేంద్ర జోక్యాన్ని అడ్డుకోండి

(మొదటి పేజీ తరువాయి)

సమాఖ్య నిర్మాణాన్ని దెబ్బతీసే అవకాశం ఉందని వాదించింది. ఎగ్జిక్యూటివ్ చర్యలతో కేంద్ర ప్రభుత్వం 'తన బడ్జెట్ ప్రక్రియపై నియంత్రణను తీసుకుంది. రాష్ట్రానికి రుణాలు తీసుకునే స్వంత ఆర్థిక వ్యవస్థలను నియంత్రించే అధికారంలో కేంద్రం జోక్యం చేసుకుంది' అని కేరళ ప్రభుత్వం పేర్కొంది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 ప్రకారం కేరళ తన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో దావా వేసింది. కేంద్ర ప్రభుత్వం రుణ పరిమితిని విధించడం వల్ల సంవత్సరాలుగా చెల్లించని బకాయిలు పేరుకుపోతున్నాయని, తీవ్రమైన ఆర్థిక సంక్షోభానికి దారితీయవచ్చని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ చర్యలతో 2016-2023 ఆర్థిక సంవత్సరంల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.1,07,513.09 కోట్ల సంచిత వ్యయ నష్టం, వనరుల లోటును చవిచూసిందని కోర్టు తెలిపింది.


ఈ కారణంగానే రాష్ట్రం తన వార్షిక బడ్జెట్‌లో ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోయిందని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 293 ప్రకారం రాష్ట్ర ఆర్థిక స్వయం ప్రతిపత్తికి అనుగుణంగా రాష్ట్రానికి చెందిన కన్సాలిడేటెడ్ ఫండ్ భద్రత లేదా హామీపై రుణం తీసుకోవడానికి రాష్ట్రానికి ప్రదానం చేసిన కార్యనిర్వాహక అధికారాన్ని కేరళ ప్రభుత్వం ప్రస్తావించింది. "రాజ్యాంగంలోని ఆర్టికల్ 293 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసే రాజ్యాంగ హక్కు, అధికారం కేంద్రానికి లేదు. ఇది రాష్ట్రం ప్రత్యేక ఆర్థిక డొమైన్‌లను అతిక్రమించడంతో సమాఖ్య నిర్మాణాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది" అని కేరళ పేర్కొంది. కాగా, ఈ కేసు వచ్చే ఏడాది జనవరిలో విచారణకు రావచ్చు. ఎందుకంటే సుప్రీంకోర్టు శీతాకాల సెలవులు డిసెంబర్ 16 (శనివారం) నుండి ప్రారంభమవుతాయి. వచ్చే ఏడాది జనవరి 02 (మంగళవారం)న తిరిగి సుప్రీంకోర్టు పున్ణప్రారంభం కానుంది. కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టు నుండి తక్షణ జోక్యాన్ని కోరింది.

## ఛత్తీస్‌గఢ్ సీఎంగా విష్ణుదేవ్ సాయ్ ప్రమాణస్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

బిశ్వభూషణ్ హరిచందన్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు కేంద్రమంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఎమ్మెల్యేగా విష్ణుదేవ్‌ను గెలిపిస్తే.. అధికారంలోకి వచ్చాక ఆయనకు పెద్ద పదవి వచ్చేలా చూస్తామని అమిత్‌షా ఒక సభలో చెప్పడం గమనార్హం. ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకున్నారని చెప్పడం ప్రస్తావనార్హం.

## స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్ ఎన్నిక



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: శాసనసభ స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు. స్పీకర్ ఎన్నికకు ప్రసాద్ కుమార్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ప్రసాద్ కుమార్ అభ్యర్థిత్వానికి ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ పార్టీలు మద్దతు తెలిపాయి. దీంతో ఆయన ఎన్నిక లాంఛనమే కానుంది. రాజకీయాలకతీతంగా ఉండే స్పీకర్ ఎన్నిక ప్రక్రియకు కూడా బీజేపీ దూరంగా ఉంది. స్పీకర్ ఎన్నికకు సంబంధించి శాసనసభ కార్యదర్శి వి.నరసింహా చార్యులు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉండగా, అధికార పక్షం నుంచి గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం నామినేషన్ వేశారు. ఆయన నామినేషన్ పత్రంపై సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సంతకాలు చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఇతర ఎమ్మెల్యేల సమక్షంలో అసెంబ్లీ కార్యదర్శికి ప్రసాద్ కుమార్ నామినేషన్ పత్రాలు అందజేశారు. గురువారం శాసనసభ ప్రారంభంకాగానే స్పీకర్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఎన్నికైనట్టు ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ప్రకటించనున్నారు. సభా నాయకుడు, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రతిపక్ష నాయకులు ప్రసాద్ కుమార్ తోడ్కొని స్పీకర్ స్థానం వద్దకు తీసుకెళతారు. అనంతరం స్పీకర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. ఉభయ సభలనుద్దేశించి శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగిస్తారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనసభలో శనివారం చర్చ జరగనుంది.

## ఎల్అండ్‌టీ, హెచ్ఎంఆర్ఎల్‌పై విచారణ
# ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్ట్‌పై సమీక్ష



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : మెట్రోరైలు లైన్ల అలైన్‌మెంట్, నిర్వహణలో అనేక అవకతవకలకు పాల్పడిన ఎల్అండ్‌టీ, హెచ్ఎంఆర్ఎల్‌పై విచారణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్‌పై బుధవారం సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్రో లైన్ల విస్తీర్ణం, నిర్వహణ, కొత్త లైన్ల అలైన్‌మెంట్‌పై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాతబస్తీలో 5.5 కి.మీ మేర పూర్తికానప్పటికిఅనేక ప్రయోజనాలు అందజేయడం పట్ల సీఎం అసంతప్తి వ్యక్తం చేశారు. విమానాశ్రయం రాయితీ ఒప్పందం, మెట్రో రైల్ అనుబంధ రాయితీ ఒప్పందాలకు సంబంధించి క్షుణ్ణంగా పరిశీలించాలని అధికా రులను ఆదేశించారు. నగర జనాభాలో ఎక్కువ భాగం పాత నగరంలో ఉన్నందున, ఎంజీబీఎస్, ఫలక్ నామా, ఎల్బీనగర్ ,చాంద్రాయణ గుట్ట మీదుగా ఎయిర్ పోర్టు మెట్రో కొత్త అలైన్‌మెంట్ కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీటితో పాటు ఫార్మాసిటీపై కూడా సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎన్ఐఆర్‌డీపీఆర్,
# జీబీపీఎన్ఐహెచ్ఈ మధ్య ఎంఓయూ
### - గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో పరస్పర సహకారం



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, వ్యవసాయ ఆధారిత జీవనోపాధి వ్యూహాలు, ఉపాధి కల్పనలో సంయుక్త భాగస్వామ్యంలో భాగంగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) హైదరాబాద్, జీబీ పంత్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ ఎన్విరాన్‌మెంట్ మధ్య బుధవారం అవగాహనా ఒప్పందం(ఎంఓయూ) కుదిరింది. కార్యక్రమంలో ఎన్ఐఆర్‌డీపీఆర్ రిజిస్ట్రార్ మనోజ్‌కుమార్, సహజ వనరుల నిర్వహణ, వాతావరణ మార్పు, విపత్తు నిర్వహణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ రవీంద్ర గావలి, ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నరేంద్రకుమార్, ఉన్నతాధికారులు డాక్టర్ కేశవరావు, డాక్టర్ కతిరేసన్, ప్రొఫెసర్ సునీల్ నౌటియల్, డాక్టర్ రాకేశ్ కుమార్ సింగ్, డాక్టర్ జగదీశ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయాధారిత జీవనోపాధి వ్యూహాలు, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కార్యక్రమాలు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా ఉపాధి కల్పన తదితర అంశాల్లో ఈ రెండు సంస్థలు సంయుక్తంగా పనిచేయనున్నాయి. డైరెక్టర్ జనరల్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ..వ్యవసాయ ఆధారిత జీవనోపాధి కార్యకలాపాలను ప్రోత్సహించడంలో రెండు సంస్థలూ కీలకమైనవని చెప్పారు. నరేగా, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ అమలు, గ్రామీణ ప్రాంతాల్లో కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించడం, సాంకేతిక సహకారం, ఉపాధి కల్పన, జీవనోపాధి ఎంపికలు, షెడ్ మేనేజ్‌మెంట్, విలేజ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ద్వారా గ్రామ పంచాయతీలను ముందుకు తీసుకెళ్లడం తదితర అంశాల్లో కలిసి పనిచేస్తామని చెప్పారు. ఎస్‌హెచ్‌జీల ద్వారా మార్కెటింగ్ చేసి గ్రామీణ ప్రజలకు జీవనోపాధిని పెంచేందుకు మరింత సమన్వయంతో ముందుకెళ్తామని వివరించారు.

# కాంగ్రెస్‌కు ఇప్పుడు తెలిసొస్తుంది
### - కాంగ్రెస్‌కు ఇప్పుడు తెలిసొస్తుందిఆ పార్టీ ప్రజలను మభ్యపెట్టింది
### : మాజీ మంత్రి కేటీఆర్ సెటైర్లు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : అమలుకు సాధ్యం కాని అనేక హామీలను ఇవ్వటం ద్వారా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. తద్వారా అది ప్రజలను మభ్యపెట్టిందని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి 'ఆ బరువేంటో' దానికి తెలిసొస్తుందని ఎద్దేవా చేశారు. స్పీకర్ పదవికి నామినేషన్ల సందర్భంగా బుధవారం అసెంబ్లీకి విచ్చేసిన కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్క రోజు కూడా పద్దులపై చర్చించలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్న రాహుల్ గాంధీ హామీ ఏమైంది..? తొలి మంత్రివర్గంలోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధతన్న వాగ్దానం ఎక్కడ..? అంటూ ఆయన ప్రశ్నించారు.

# నెగెటివ్ మైండ్‌సెట్ మారాలి

### - లేకుంటే గట్టిగానే సమాధానం చెప్తాం
### -ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఎంతో ఉపయోగకరం
### - సిద్దిపేటలో మార్నింగ్ వాక్ నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్



సిద్దిపేట - ప్రభాత సూర్యుడు కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో కూలుతుందని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, 110 సీట్లలో డిపాజిట్ రాని బీజేపీ నేతలు చెప్పడం సభ్య సమాజం అసహ్యించుకుంటోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజలు మార్పు కోరుకోవడంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, నెగిటివ్ మైండ్‌సెట్‌ను మార్చుకోకుంటే కాంగ్రెస్ వారికి గట్టిగా సమాధానం చెబుతుందని చెప్పారు. సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం మంత్రి మార్నింగ్ వాక్ నిర్వహించి.. అక్కడికి వచ్చిన ప్రజలతో ముచ్చ డించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లా డుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందని, ఎమ్మెల్యేలు పోతారని ప్రతిపక్షాలు అనడం వారి నెగటివ్ మైండ్‌సెట్‌ను బయట పెడుతోందన్నారు. రాజాసింగ్ 10 మంది ఎమ్మెల్యేలు పోతారని అనడం ఏమైనా జ్యోతిష్యం చదివారా అని ప్రశ్నించారు. ప్రొటెం స్పీకర్ విషయంలో కూడా మతపరమైన అంశాలు తీసుకు రావడం సరికాదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం కూలాలి.. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకుంటున్నారని, వారి కుట్రలు, వ్యూహం తమకు తెలుసునన్నారు. హుస్నాబాద్‌ను మోడ్రన్ నియోజకవర్గంగా మారుస్తామన్నారు. 'గౌరవెల్లి ప్రాజెక్టును కుర్చీ వేసుకుని కడతామని చెప్పిన గత ప్రభుత్వం 70 శాతం పనులైన సొరంగమార్గం, ప్రాజెక్టు కట్టనిర్మాణం వరకే పూర్తిచేసిందన్నారు. ఇరిగేషన్ పరంగా హుస్నాబాద్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. గండిపేట ప్రాజెక్టుకు ఒక్క రూపాయి కేటాయించలేదని, తోటపల్లి ప్రాజెక్టు రద్దు చేశారని, అక్కడ భూ నిర్వాసితులకు ఏ విధంగా న్యాయం చేయాలో సీఎం స్థాయిలో సమీక్షించి వారికి సహకరి స్తామన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితుల సమస్యను మాజీ ఎమ్మెల్యేలు జటిలం చేశారని, చర్చల ద్వారా సమస్య పరిష్కారం కానిది ఏదీ లేదన్నారు. రైతులంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే రైతులని అన్నారు. తాము ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి అర్హులకు ఇస్తామని అన్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలోని 'డబుల్' ఇండ్లలో భూ నిర్వాసితులు ఉంటున్నారని, సీఎంతో చర్చించి అవి వారికే కేటాయించడమా లేదా ఎన్నికల సమయంలో గత ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన వారికా.. చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తీసుకురావడం మూలంగా వారికి ఎంతో ఉపయోగకరంగా ఉందని అన్నారు. పాత బస్టాండులో మంత్రి బస్సులో ప్రయాణిస్తున మహిళలతో కొంతసేపు ముచ్చటించారు. వారు ఎక్కడి నుంచి వచ్చారు.. ఎక్కడికి వెళ్తున్నారు.. ఉచితంగా ప్రయాణం చేశారా.. వారికి ఎంత డబ్బు ఆదా అవుతుందన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నర్సారెడ్డి, నాయకులు పూజలు హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్ రెడ్డి, గూడూరు శ్రీనివాస్, తాడూరి శ్రీనివాస్, సూర్య వర్మ, గాడి పల్లి శ్రీనివాస్ రెడ్డి, కలీముద్దీన్, దాస అంజయ్య, అత్తు ఇమామ్, సతీష్, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డిని
# కలిసిన టీఎస్‌యూటీఎఫ్ నాయకులు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర నాయకులు ఎమ్మెల్సీ అలుబెల్లి నర్సిరెడ్డి నేతృత్వంలో నూతన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లోని సచి వాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రేవం త్‌రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి, ప్రజాస్వామిక వాతావరణం ఏర్పాటుకు పాటుపడాలని కోరారు. మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్‌ను రద్దు చేయాలనీ, పదోన్నతుల సంక్షోభాన్ని పరి ష్కరించాలని సూచించారు. జీవో నెంబర్ 317 బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు. వేతనాలు, బకాయిలు సకాలంలో చెల్లించాలనీ, ఉద్యోగుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని రుతూ లేఖను సీఎం రేవంత్‌రెడ్డికి సమర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పం దించారు. మ్యానిఫెస్టోలోని అంశాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య చావ రవితోపాటు కోశాధికారి టి లక్ష్మారెడ్డి, కార్యదర్శులు ఎ వెంకట్, ఎం రాజశేఖర్‌రెడ్డి, ఈ గాలయ్య ఎ సింహాచలం వై జ్ఞానమంజరి, పత్రిక ప్రధాన సంపాదకులు పి మాణిక్ రెడ్డి, మోడల్ స్కూల్ నాయకులు కొండయ్య, గురుకుల ఉపాధ్యాయ నాయకులు నర్సింహా, కేజీబీవీ రాష్ట్ర ప్రతినిధి విశాలాక్షి, రాష్ట్ర కమిటీ సభ్యులు గోపాల్ నాయక్, వెంకటప్ప, రఘుపాల్ తదితరులు పాల్గొన్నారు. మోడల్ స్కూల్ సమస్యలను పరిష్కరించండి , సీఎం రేవంత్‌రెడ్డికి ఎంఎస్‌టీఎఫ్ నేతల వినతి ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నేతృత్వంలో తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎంఎస్‌టీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు బి.కొండయ్య మంగళవారం హైద రాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. 2013లో యూపీఏ హయాంలో మోడల్ స్కూళ్లు ప్రారం భమయ్యాయని గుర్తు చేశారు. ప్రస్తుతం విజయ వంతంగా నడుస్తున్నాయని తెలిపారు. కానీ నేటికీ అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయని పేర్కొన్నారు. ఆ సమస్యల పరిష్కారం చేయాలని సీఎంను కోరారు. దానికి ముఖ్యమంత్రి స్పందిస్తూ.. తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# వేధింపులకు షీటీమ్స్ అడ్డుకట్ట
### - 15 రోజుల్లో 117 మంది ఆకతాయిల పట్టివేత




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : బస్టాండ్‌లు, రైల్వే, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, రోడ్లు, కాలేజీలు, రద్దీ ప్రాంతాలు, చివరకు దేవాలయాలు, ఉత్సవాల్లోనూ పోకిరీల ఆగడాలు మితిమీరుతున్నాయి. అయితే, షీ బృందాలు ఎప్పటికప్పుడూ ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తున్నాయి. బాధిత యువతులు, మహిళలకు 'మీ కోసం మేమున్నామని భరోసా' ఇస్తున్నాయి. 15 రోజుల్లో 117 మందిని రాచకొండ షీ టీమ్స్ అదుపులోకి తీసుకున్నాయి.గత నెల నవంబర్ 16 నుంచి 30 వరకు 135 ఫిర్యాదులు షీ బృందాలకు అందాయి. ఫోన్ల ద్వారా వేధించినవి 24కాగా, వాట్సాప్ ద్వారా వేధించినవి 30, సోషల్‌మీడియా ద్వారా వేధించినవి 18, నేరుగా 63 మంది ఆకతాయిలు వేధింపులకు పాల్పడ్డారు. విచారణ చేపట్టిన షీ బృందాలు నాలుగు క్రిమినల్ కేసులు, 47 పెట్టి కేసులు నమోదు చేశాయి. మరో 68 మందికి కౌన్సెలింగ్ ఇచ్చాయి.ఏడేండ్లుగా వేధిస్తున్న మీడియా వ్యక్తి అరెస్ట్ఎల్‌బీ నగర్‌లో నివాసముంటున్న ఓ గృహిణి ప్రయివేటు కంపెనీలో పనిచేస్తోంది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న ఓ వ్యక్తి ఏడేండ్లుగా ఆమెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దాంతో అతని తల్లిదండ్రులకు విషయం చెప్పింది. అయితే, కొద్దిరోజులు బాగానే ఉన్న నిందితుడు, తిరిగి వేధించడం ప్రారంభించాడు. విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆమెను బెదిరించాడు. దీంతో బాధితురాలు ఎల్‌బీనగర్ షీ టీమ్స్‌ను సంప్రదించింది. వెంటనే స్పందించిన షీ బృందాలు నిందితున్ని అదుపులోకి తీసుకొని ఎల్‌బీనగర్ పోలీసు స్టేషన్‌లో అప్పగించి క్రిమినల్ కేసు నమోదు చేశారు. ప్రేమించాలంటూ బాలికకు వేధింపులు, వనస్థలిపురంలో ఉండే 14 ఏండ్ల బాలిక 9వ తరగతి చదువుతోంది. ప్రతిరోజూ స్కూల్‌కు వెళ్లి వస్తుంటే, మార్గమధ్యలో ఓ బాలుడు 9 నెలల నుంచి ప్రేమించాలని వేధిస్తున్నాడు.

దాంతో బాలిక తల్లి దండ్రులతో కలిసి షీ టీమ్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన షీ బృందాలు అతన్ని అరెస్టుచేసి కేసు నమోదు చేశాయి.మల్కాజ్‌గిరిలో నివాసముండే 16 సంవత్సరాల బాలిక తమ అపార్ట్ మెంట్‌లోకి పోతూ గేటు మూసే స్తుండగా, ఇంతలో గేటు ముందుకు బైక్‌పై ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చాడు. అకస్మాత్తుగా తన ప్యాంట్ విప్పి ప్రయివేటు పార్ట్స్ ఆమెకు చూపించాడు. ఆమె వెంటనే ఇంట్లో చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు నిందితున్ని అరెస్టు చేశారు. అవగాహన కార్యక్రమం నవంబర్ 16 నుంచి 30 వరకు రాచకొండ షీ టీమ్స్ 47 అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. మహిళా చట్టాలు, వారి హక్కులు, నేరాలపై దాదాపు 8275 మందికి అవగాహన కల్పించాయి. డెకారు ఆపరేషన్, కుషాయిగూడ పరిధిల్లో షీ బృందాలు డెకారు ఆపరేషన్ నిర్వహించాయి. బాధితులు షీ బృందాలకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నేరుగా కానీవాట్సాప్‌లో 8712662111లో ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశం, ఇన్‌స్పెక్టర్ పి.పరశురాం, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీటీమ్స్ సిబ్బంది, కౌన్సిలర్స్ శాంతిప్రియ, రమ్యా, శ్యామల గౌరి తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకంతో ఆటో కార్మికులకు నష్టం

**- ఆటో డ్రైవర్లు ఆవేదన**



మిరుదొడ్డి - ప్రభాత సూర్యుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకంతో తమ పొట్టకొట్టే విధంగా ఉందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించడంతో ప్రయాణికులు పూర్తిస్థాయిలో బస్సులలో ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగించే డ్రైవర్ల పరిస్థితి మరీ దయనీయంగా మారిందన్నారు. కొద్దిరో జులుగా డీజిల్ డబ్బులు కూడా రావడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆటో డ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆటో డ్రై వర్లకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళ నలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బాలమలు, నాగరాజు, మహెందర్, మహేశ్, హరీశ్, శంకర్ రాజు, కిరణ్, కుమార్, బాబు, కిరణ్ పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాల కూల్చివేత



అబ్దుల్లాపూర్ మెట్- ప్రభాత సూర్యుడు : ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలం పసుమాముల గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 386, బాచారం రెవిన్యూ పరిధి సర్వే నెంబర్ 214లలో గల ప్రభుత్వ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలను రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎండి నిజాముద్దీన్ ఆధ్వర్యంలో కూల్చివేశారు. మండల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆర్ఐ ఎండి నిజాముద్దీన్ హెచ్చరించారు.

## ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న యువకుడు



యాచారం - ప్రభాత సూర్యుడు : అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకొని యువకుడు మరణించిన సంఘటన మాల్ ఒక బైక్ షోరూం లో చోటుచేసుకుంది. యాచారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యాచారం మండలం కురుమిద్ద గ్రామానికి చెందిన సురికి కళ్యాణ్ తండ్రి రాములు 21 సంవత్సరాలు మాల్ గ్రామంలో తను పని చేస్తున్నటువంటి బైక్ షోరూంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసు కున్నాడని యాచారం పోలీసులు తెలిపారు. ఎవరి మీద అనుమానం లేదని కుటుంబ సభ్యులు యాచారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందజేయగా పోలీసులు కూడా సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి ఇబ్రహీంపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం నివేదిక ప్రకారం వివరంగా అందజేస్తామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య, ఎస్సై వెంకట్ నారాయణ తెలిపారు.

### మంత్రి సీతక్కకు

## సర్పంచుల సంఘం నేతల శుభాకాంక్షలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : రాష్ట్ర పంచాయతీరాజ్ మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)కి రాష్ట్ర సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు భూమన్న యాదవ్, మహిళా అధ్యక్షులు జూలూరు ధనలక్ష్మి, కార్యవర్గ సభ్యులు వెంకటేష్, రామేశ్వర్‌రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆమెను వారు కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుచ్ఛగుచ్ఛం అందజేశారు. శాలువాతో సత్కరించారు. ఐదేండ్లలో సర్పంచులు చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి సర్పంచులను మంత్రి సీతక్క అడిగి తెలుసుకున్నారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించీ ఆరా తీశారు. త్వరలోనే సర్పంచుల సమస్యలకు పరిష్కార మార్గం చూపుతామని మంత్రి హామీనిచ్చారు.



# కబ్జాలను అరికట్టాలని వినతి పత్రం

ప్రభాత సూర్యుడు - కుత్బుల్లాపూర్ : ఎన్నిసార్లు వినతి పత్రాలు అధికారులకు సమర్పించిన ప్రతిపక్షాలకు ఎన్నిసార్లు చెప్పినా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి కట్టడాలను ఎందుకు అరిలేకపోతున్నారని ఒక ప్రకటనలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలోనీ కుత్బుల్లాపూర్ రెవెన్యూ డివిజన్లో వందలాది ఎకరాలు ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయనీ కొత్త ప్రభుత్వంలోనైనా చర్యలు తీసుకోవాలనే విషయంపై జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేంద్ర రెడ్డికి నియోజకవర్గ సిపిఐ బృందం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధి అన్ని మండలాలలో వందలాది ఎకరాల భూమి అనా ఒ్య క్రాంతం అవుతుందని మున్సిపల్ చీఫ్ సెక్రటరీ అక్రమాలను గుర్తించి కూల్చివేయమంటే అధికారులు ఎందుకు కూల్చట్లేదని వారు ప్రశ్నించారు. అదే విధంగా గాజులరామారంలోనీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సర్వే నంబర్ 326 ,307 సంబంధించి దేవేందర్ నగర్ మిథిలా నగర్ బాలయ్య బస్తి రావి నారాయణరెడ్డి నగర్ మొత్తం అన్యాక్రాంతం అయ్యిందని , సర్వే నంబర్ 12లో అప్పటి కలెక్టర్ ఎం.వి.రెడ్డి హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటితే ఆ భూమిని కూడా కబ్జా చేశారని , అదేవిధంగా జగద్గిరిగుట్టలోని సర్వే నంబర్ 348/1 లో గల దేవాలయ భూమి, రాజీవ్ గృహకల్ప భూములు , బాచుపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ




భూములు చెరువులు కుంటలు అక్రమ కట్టడాలకు గురవుతున్నాయని వారు అన్నారు. నిజాంపేటలోని మధురానగర్ అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో గల భూమి గతంలో మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న గోపి వెజిటేబుల్ మార్కెట్ కోసం కేటాయించిన స్థలాన్ని కొంతమంది కబ్జాదారులు కట్టడాలకు గురి చేస్తున్నారు. జర్నలిస్ట్ కాలనీ వద్ద సర్వే నంబర్ 344, నిజాంపేట్ సర్వే నంబర్ 87, సర్వే నంబర్ 90, మరియు 94 లకు సంబంధించి ప్రభుత్వ భూములను ప్రైవేట్ పత్రాలతో అక్రమ కట్టడాలు కడుతున్నారని నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప వద్ద బస్ స్టాప్ ను కబ్జా చేసి పర్మిషన్ లేకుండా బహుళ అంతస్తుల కట్టడాలను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు తెలియజేసిన పట్టించుకోకుండా కనీసం అటువైపు కూడా చూడలేదని ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ తో చర్చించడానికి వెళితే ఆయన సమయం ఇవ్వలేదని వారు తెలియజేశారు. వీటిని అరికట్టనీయే డల పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ప్రజాదర్బార్ సహకారంతో ఈ కబ్జాల గురించి ప్రభుత్వ దృష్టికి తీసుకెల్లడం కాయమనీ వినతి పత్రంలో తెలియజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి పార్టీ కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథరావు, మండల కోశాధికారి సదానంద ,ఏఐటియుసి కార్యదర్శి శ్రీనివాస్ ,స్థానిక నాయకులు కే మహేష్, కే నాగేశ్వర్లు పాల్గొన్నారు.

### నల్ల కంచె గురుకుల విద్యాలయంలో

# ముగిసిన జోనల్ లెవెల్ సైన్స్ ఫెయిర్

**-నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు**
**-ప్రతి అంశాన్ని గమనించినప్పుడే**
**-ప్రతి వృత్తిలోనూ ఉన్నతంగా రాణించగలరు**






ఇబ్రహీం పట్నం - ప్రభాతసూర్యుడు : ఇబ్రహీంపట్నం నల్ల కంచె గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపల్ లీలావతి ఆధ్వర్యంలో జరిగిన జోనల్ లెవెల్ సైన్స్ ఫెయిర్ 11-12-23 తేదీ నుండి ప్రారంభమై 13-12-23 బుధవారం రోజున ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గురుకుల పాఠశాల డిప్యూటీ సెక్రెటరీ వెంకటలక్ష్మి, మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో 65 పాఠశాలల నుండి260 మంది విద్యార్థులు130 వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రదర్శించారు. వివిధ పాఠశాలల నుండి విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు స్థానిక పాఠశాలల నుండి ప్రదర్శనలు దర్శించారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న వైజ్ఞానిక ప్రదర్శనలకు న్యాయ నిర్ణేతులగా విక్షించి విజేతలను ప్రకటించారు. ప్రిన్సిపల్ లీలావతి మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో ప్రదర్శించిన విద్యార్థులందరినీ అభినందించారు. నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు అని అభివర్ణిస్తూ నిత్యజీవితంలో సైన్సు పరంగా ప్రతి అంశాన్ని అన్వేషిస్తూ గమనించినప్పుడే ప్రతి వృత్తిలోనూ ఉన్నతంగా రాణించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ సి ఓ, హెచ్ ఆర్ ఆర్,ఈస్ట్, నాగ కళ్యాణి, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్, నల్ల కంచె ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పోషణ లోప చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా**

పాల్వంచ - ప్రభాతసూర్యుడు : గర్భిణి నుండి ఆరోగ్యవంతమైన చిన్నారుల జననం వరకు పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అంగన్వాడి సిబ్బందికి సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశం హాల్లో జిల్లా మహిళా శిశు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి సేవలపై సిడిపిఓలు, సూపర్వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ లోపల చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. చిన్నోళ్ల ఆరోగ్య పరిరక్షణ నూరు శాతం బరువు ప్రక్రియ జరగాలని తెలిపారు. ఆన్‌లైన్ ప్రక్రియలో వ్యత్యాసం ఉండడం వల్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ నమోదులో ఎలాంటి వ్యత్యాసాలు రాకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. పోషణ లోపం ఉన్న చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ చర్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని 11 ప్రధాన అంగన్వాడి కేంద్రాల్లో ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల వయస్సున్న చిన్నారులు 32,358 మంది 3-6 సంవత్సరాల వయస్సున్న 27,077 మంది చిన్నారులు ఉన్నట్లు చెప్పారు. అలాగే 11 ప్రధాన అంగన్వాడి కేంద్రాల పరిధిలో 7,436 మంది గర్భిణీలు, 7,181 మంది బాలింతలకు ఆరోగ్య లక్ష్మి ద్వారా బలవర్ధక ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు. చిన్నారుల నమోదు ప్రక్రియ నూరు శాతం జరగాలని




వ్యత్యాసం ఉండడం వల్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణీలకు బాలింతలకు రేషన్ అందక పోతే సిడిపిఓలను బాధ్యులను చేసి చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. గర్భి ణులకు, బాలింతలకు రోజువారి మెనూ ప్రకారం ఆహారం అందజేయాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు మరమ్మత్తులు మరుగుదొడ్లు నిర్మాణానికి 2018 సంవత్సరంలో నిధులు మంజూరు చేస్తే ఎందుకు పూర్తి చేయలేక పోయారని టీఎస్ ఈడబ్ల్యూ ఇంజనీర్ అధికారులను ప్రశ్నించారు. నిర్మించడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.. నిధులు మంజూరు చేసింది మీ దగ్గర పెట్టుకోవడానికి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాలపై డాక్యుమెంటేషన్ నివేదికలు అందజేయాలని చెప్పారు. అంగన్వాడి కేంద్రాల్లో వర్షపు నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు నిర్మించాల్సి ఉన్నందున ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారని సిడిపిఓలను అడిగి తెలుసుకున్నారు. జూలూరు పాడు ఎంపీడీవోతో ఫోన్లో మాట్లాడి వారం రోజుల్లో పనులు ప్రారంభం కావాలని ఆదేశించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం మరుగుదొడ్లు ఉండాలని వాటిపై నివేదికలు అందజేయాలని చెప్పారు. రానున్న ఫిబ్రవరి మాసం వరకు పూర్తి చేయు విధంగా చర్యలు చేపడతామని, వాస్తవ నివేదికలు అంద జేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు పరిధిలోని కేంద్రాలను పర్యవేక్షణ చేయాలన్నారు. పోషణలోపం ఉన్న చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ఇంటింటి పర్యవేక్షణ జరగాలని చెప్పారు. పోషణ లోపం ఉన్న చిన్నారిలో ఆరోగ్య పరిరక్షణకు ఇంటింటి పర్యవేక్షణ జరగాలని ఆదేశించారు. రానున్న నెల రోజుల్లో చిన్నారులు ఆరోగ్యంలో ప్రగతి రావాలని సూచించారు. పోషణ లోపు చిన్నపిల్లల ఆన్‌లైన్ ప్రక్రియ సిగల్స్ సమస్య ఉన్నదని సిడిపిఓలు తెలుపగా లిఖిత పూర్వకంగా వ్రాసివ్వాలని చెప్పారు. జిల్లాశిశుమహిళ వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి అంగన్వాడీ కేంద్రాల ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా శిశు మహిళా వైద్య సంక్షేమ అధికారి విజేత, సిడిపిఓలు, ఏసిడిపి ఓలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215